క్లుప్తంగా

ఎంఎస్‌ఎంఈ సర్వేకు సహకరించండి

పుంగనూరు: పుంగనూరు, చౌడేపల్లె మండలాల్లో ఎంఎస్‌ఎంఈ సర్వే నిర్వహిస్తున్నట్లు రెండు మండలాల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లీలా మాధవి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ, సచివాలయ ఉద్యోగులతో సర్వే నిర్వహిస్తున్నామని, సర్వేకు ప్రజలు సహకరించి, సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు.

పూల తోటల పరిశీలన


తోటలను పరిశీలిస్తున్న అధికారులు

సదుం: మండలంలోని బలిజపల్లెలో పూలతోటలను రైతు శిక్షణ విభాగం ఏడీఏ నాగపద్మిని, ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ సంధ్యారాణి సోమవారం పరిశీలించారు. పూత పూసే సమయంలో మొక్కలు చనిపోతున్నట్టు వ్యవసాయ శాఖ అధికారులకు రైతులు నివేదించడంతో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతంలో పర్యటించారు. పంట వేసే ముందు కాపర్ ఆక్సీ క్లోరైడ్ పొలంలో వేసి కలియదున్నాలని రైతులకు సూచించారు. లేనిపక్షంలో ట్రికో డెర్మా విరిడి మందును పశువుల ఎరువుతో కలిపి నాటే ముందు పొలంలో చల్లుకోవాలన్నారు. పంట మార్పిడి పద్ధతులు పాటించాలన్నారు. ఏఓ హరిప్రసాద్, ప్రమీల పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న సీఐ నరసింహరాజు

పలమనేరు: సైబర్ నేరాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని స్థానిక సీఐ నరసింహరాజు మండలంలోని మహిళా పోలీసులను ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన సచివాలయ పోలీసులకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెచ్చుమీరుతున్నాయన్నారు. ముఖ్యంగా వీటి బారిన పడకుండా ఎస్‌హెచ్‌జీ మహిళా సమావేశాల్లో వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ స్వర్ణతేజ, పలువురు మహిళా పోలీసులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పలమనేరు: మున్సిపాలిటీపరిధిలోని గొబ్బిళ్ల కోటూరుకు చెందిన 14 ఏళ్ల బాలిక అదృశ్యమైందని తల్లిదండ్రులు సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విరివిగా మొక్కలు పెంచుదాం



పలమనేరు: మొక్కలను విరివిగా పెంచి వాయు కాలుష్యాన్ని నివారణకు కృషి చేయాలని పలమనేరు ప్రకృతి నిర్వాహకులు మల్లిచెట్ల దేవేంద్ర కోరారు. పట్టణంలోని ఓ స్కూల్ వద్ద పలు రకాల మొక్కలను విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. పట్టణ ప్రజలు వీలైనన్ని మొక్కలను పెంచి సంరక్షించడం ఒక బాధ్యతగా స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

కౌండిన్యలో ఎలిఫెంట్ హబ్‌కు చర్యలు


ఎఫ్‌ఆర్వోతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పలమనేరు: కౌండిన్య అభయారణ్యంలోని ముసలిమొడుగు వద్ద ఎలిఫెంట్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి వెల్లడించారు. సోమవారం తన కార్యాలయంలో ఇక్కడి ఎఫ్‌ఆర్వో నారాయణతో ఎమ్మెల్యే చర్చించారు. ఈ సమస్యపై ఇటీవలే అసెంబ్లీలో మాట్లాడామని, దీనికి సంబంధించి డీపీఆర్ సైతం సిద్ధమైందన్నారు. ఈ ప్రాజెక్టుకు అటవీ శాఖ నిధులుసైతం ఉండడంతో ఇబ్బంది ఉండదన్నారు. ఎఫ్‌ఆర్వో మాట్లాడుతూ, తమ సిబ్బందితోపాటు ఎలిఫెంట్ ట్రాకర్స్ 20మంది కర్ణాటకలో ప్రత్యేక శిక్షణ పొందుతున్నారని, మదపుటేనుగుల కట్టడికి క్రాల్, డిస్పెన్సరీలను సైతం ఏర్పాటు చేస్తామన్నారు. ఇవన్నీ ఏర్పాటైతే ఏనుగుల సమస్యకు అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన చుడా చైర్‌పర్సన్

స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత పట్టణంలోని ఆయన కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని అందరి ఎమ్మెల్యేలను కలసి వారి సూచనలనతో చుడా అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె చెప్పారు. స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రెండు ఆవులు మృతి

రామకుప్పం: మూడు రోజులుగా మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు కావలిమడుగు గ్రామంలో గడ్డివామి కూలి రెండు ఆవులు మృతి చెందాయి. బాధితుల కథనం.. గ్రామంలోని ఆందనగౌడు అనే పాడి రైతు తన ఆవులను గడ్డివాము కిందనే కట్టి ఉంచారు. ఆదివారం రాత్రి అకస్మాత్తుగా గడ్డివాము కూలడంతో పశువులు మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. సుమారుగా రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గ్రామాల అభివృద్ధికి కూటమి గ్రహణం!

మండలాల అభివృద్ధిలో మండల, జెడ్పీ నిధులే కీలకం. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి పంచాయతీ గ్రామసభలు, మండల సర్వ సభ్య సమావేశాల్లో ఆమోదించే తీర్మానాలకు అనుగుణంగా నిధులు వ్యయం చేయడం పరిపాటి. ఇది ప్రజాస్వామ్యబద్ధంగా సాగే ప్రక్రియ. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనికి తూట్లు పొడిచింది. తీర్మానాల మేరకు ఆయా మండలాల్లో ఇప్పటికే మంజూరైన నిధులను తమ ఆమోదం లేనిదే పనులు చేయరాదని ఎంపీడీఓలకు కూటమి నేతలు అల్టిమేటం ఇచ్చారు. వీరి వత్తిళ్లకు అధికారులు తలొగ్గడం అభివృద్ధికి శాపంగా పరిణమించింది. చివరకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పరిస్థితిలో మార్పు లేదంటే పాలనపై కూటమి నాయకుల పెత్తనం ఏ స్థాయిలో ఉంటోందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

- మండల, జెడ్పీ నిధులకు అధికార పార్టీ నేతల అడ్డంకులు
- వత్తిళ్లకు తలొగ్గి జీ హుజూర్ అంటున్న అధికారులు
- సమస్యలతో సతమతమవుతున్న గ్రామాలు


గంగవరం మండలంలోని కొంగోళ్లపల్లెలో వీధుల దుస్థితి ఇది

పలమనేరు: గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని మహాత్మాగాంధీ అన్న మాట. కానీ క్షేత్రస్థాయిలో గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘ నిధులు అరకొరగా రావడంతో గతంలోని బకాయిలకు సగంపోగా మిగిలిన నిధులతో పనులు చేయడానికి మల్లగుల్లాలు పడుతున్నారు. ఇక బేసిక్ గ్రాంట్‌లో టైడ్‌కు సంబంధించిన నిధులు విడుదలైనా అవి బ్యాంకుల్లో అడ్జెస్ట్ కాక ఇంకా పంచాయతీల ఖాతాలకు జమ కాలేదు. అసలే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పారిశుద్ధ్యం, తాగునీరు, రిపేర్లు..ఇత్యాది వాటికి ఈ నిధుల నుంచే ఖర్చుచేయాల్సి ఉంది. కానీ ఇవి ఇప్పటికీ అందకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు జెడ్పీ, మండల గ్రాంట్లకు సంబంధించిన నిధులు ఉన్నా కూటమి నేతలు వీటిని ఖర్చు పెట్టనీయకుండా అడ్డుకట్ట వేయడం అవరోధంగా మారింది.

పలమనేరు నియోజకవర్గంలో 15వ ఆర్థిక సంఘ నిధులిలా...

నియోజకవర్గంలో ఐదు మండలాలు, 90 పంచాయతీలున్నాయి. 15వ ఆర్థిక సంఘ నిధులు 2024–25 ద్వారా తొలి ఇన్‌స్టాల్‌మెంట్ కింద బేసిక్ గ్రాంటు అన్‌టైడ్(సీసీ రోడ్లు, భవనాలు, మురుగు కాలువలు) ద్వారా బైరెడ్డిపల్లె మండలానికి రూ.50,54,452, గంగవరానికి రూ.47,34,562, పలమనేరుకు రూ.15,26,779, వీ.కోటకు రూ.73,26,554, పెద్దపంజాణికి రూ.51,86,811 చొప్పున మొత్తంగా నియోజకవర్గానికి రూ.2.38కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులను గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల భవనాల నిర్మాణానికి వినియోగించాలి. అయితే ఈ నిధులు ఆయా పంచాయతీల్లోని అవసరమైన పనులకు సరిపోవడం లేదని సర్పంచులు చెబుతున్నారు.

ఇంకా పంచాయతీలకు అడ్జస్ట్‌కాని టైడ్ నిధులు

15వ ఆర్థిక సంఘం టైడ్ గ్రాంటులో తొలి విడత నిధుల ద్వారా బైరెడ్డిపల్లె మండలానికి రూ.75,81,678, గంగవరానికి రూ.71,01,842, పలమనేరుకు రూ.22,90,168, పెద్దపంజాణికి రూ.77,80,216, వీకోటకు రూ.1,09,89,828గా మొత్తం నియోజకవర్గానికి రూ. 27.96కోట్లు విడుదలైంది. అయితే ఈ నిధులు బ్యాంకులకు అడ్జస్ట్ అయ్యాక ఆపై పంచాయతీ ఖాతాల్లోకి చేరాలి. ఈ ప్రక్రియ ఆలస్యమవుతోంది. ఈ నిధులను గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, మంచినీటి సరఫరా, మైనర్ రిపేర్లకు వినియోగించుకోవాలి. ఈ నిధులందితేగానీ పల్లెల్లో సమస్యలు తీరేలా లేవు

జెడ్పీ, మండల గ్రాంట్లపై కూటమి నేతల పెత్తనం!

పలమనేరు మండలానికి సంబంధించి గత నెల మండల సర్వ సభ్య సమావేశంలో ఎంపీపీ నాలుగు తీర్మాణాలను ప్రవేశపెట్టారు. వీటిలో జగమర్ల మంచినీటి సరఫరా, కురప్పల్లెలో సీసీ రోడ్డు, బయ్యప్పగారిపల్లెలో పైపులైను ఏర్పాటు. ఇందుకోసం ఈ రెండు నిధుల నుంచి రూ.55లక్షలు మంజూరైంది. అయితే కూటమి నేతల ఒత్తిళ్లతో పలమనేరు ఎంపీడీఓ ఈ పనులకు ఆమోదం తెలుపలేదని ఆ మండల ప్రజాప్రతినిధులు ఇటీవల జిల్లా కలెక్టర్ సైతం ఫిర్యాదు చేశారు. ఇదే పరిస్థితి నియోజకవర్గంలోనూ ఉందని ఆయా మండలాల ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. ఇలాగైతే పల్లెల్లో అభివృద్ధి ఎలా సాధ్యమని సర్పంచులు ఆవేదన చెందుతున్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే గ్రామాలు ఎలా బాగుపడతాయి?



ఏదేని మండలంలో ఫలానా సమస్య ఉందని అక్కడి ప్రజాప్రతినిధులు నా దృష్టికి తీసుకొస్తే స్పందించి నిధులను జెడ్పీ నుంచి మంజూరు చేస్తున్నాం. ఇప్పటికే పలమనేరు నియోజకవర్గంలో పలు పనులకు నిధులను కేటాయించాం. ఈ పనులు ముందుకు సాగకుండా కూటమి నేతలు ఆయా ఎంపీడీఓలపై పెత్తనం చేస్తున్నట్టు సమాచారం ఉంది. ఇలా అభివృద్ధి అడ్డుకుంటే గ్రామాలు ఎలా బాగుపడతాయి?

–శ్రీనివాసులు, జెడ్పీ చైర్మెన్

ఎంపీడీఓలు అధికార పార్టీ నేతలకు గులాం గిరి



జెడ్పీ, మండల గ్రాంట్ల ద్వారా రూ.55లక్షల పనులను పెడితే ఎంపీడీఓ చేయడం లేదు. ఆయనకు అధికార పార్టీ నుంచి ఆదేశాలు కావాలట! దీనిపై ఇటీవలే జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశాం. అభివృద్ధి పనులు జరిగితే ప్రజలకు, గ్రామాలకు సౌకర్యంగా ఉంటుందని అధికారులు భావించడం లేదు.

–విశ్వనాథ రెడ్డి, సర్పంచ్, మొరం

నిధులు తక్కువ.. సమస్యలెక్కువ



మా పంచాయతీలో మురుగు కాలువలు దెబ్బతిన్నాయి. సీసీ రోడ్లు కావాలి. ప్రజలకు సరిపడా మంచినీరు కావాలంటే మరో రెండు మంచినీటి బోర్లను డ్రిల్ చేసి వాటికి మోటార్లు, పైప్‌లైను అవసరం ఉంది. కానీ మాకు 15వ ఫైనాన్స్‌లో అన్‌టైడ్ నిధులు కేవలం రూ.2.20లక్షలు వచ్చాయి. అవి కూడా ఇంకా బ్యాంకులోనే ఉన్నాయట. ఈ నిధులతో మా పంచాయతీలోని సమస్యలు తీరేమాటేనా?

–మునస్వామి, సర్పంచ్, టి.వడ్డూరు

పంటలపై ఏనుగుల స్వైర విహారం

- మామిడి, అరటి, కొబ్బరి, బొప్పాయి తోటలు ధ్వంసం
- రూ.2లక్షల పైబిలుకు పంట నష్టం


ఏనుగుల దాడిలో దెబ్బ తిన్న అరటి తోట

వి.కోట: ఏనుగుల గుంపు స్వైర విహారం చేశాయి. అరటి, మామిడి, కొబ్బరి తోటలను తొక్కి నాశనం చేశాయి. ఆదివారం రాత్రి ఈ సంఘటన మండలంలోని బోయచిన్నాగనపల్లె గ్రామ పరిసర ప్రాంతాల్లో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మండలంలోని నాయకనేరి అటవీ ప్రాంతంలోని గోభిదోనికుంట అడవి నుంచి బోయచిన్నాగనపల్లె సమీపంలోని పంటలపై 10 ఏనుగుల గుంపు పడింది. అడవినే ఆనుకుని ఉన్న హనుమంతు గౌడు, మురళిలకుకు చెందిన మామిడిచెట్లను విరిచేశాయి, అరటి, కొబ్బరిచెట్లను తొక్కి తిని నాశనం చేశాయి. శేషాద్రి, కొండప్ప గౌడుకు చెందిన స్వీట్ కార్న్, బొప్పాయి, కాలీఫ్లవర్ తోటలను, నారాయణస్వామికి చెందిన మెడిసిన్ దోస, అరటి చెట్లను తొక్కి, తిని తీవ్ర నష్టం కలిగించాయి. వీటి దాడుల్లో దాదాపు రూ.2 లక్షల పైబిలుకు పంట నష్టపోయామని బాధిత రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇదలా ఉంచితే, కుప్పం రేంజ్ పరిధి నుంచి ఈ ఏనుగుల గుంపు మళ్లీ మండల అటవీ సరిహద్దులోకి రావడంతో రైతుల కంటికి కునుకు కరువైంది.



ఏనుగుల దాడిలో దెబ్బ తిన్న కాలీఫ్లవర్, బొప్పాయి తోటలు

సౌత్‌జోన్ చెస్ పోటీలకు కుప్పం విద్యార్థిని


సుసిత్రను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

కుప్పం రూరల్: కుప్పం డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మూడవ సంవత్సరం చదువుతున్న కెఎస్. సుసిత్ర సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల చదరంగం చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైందని కళాశాల చైర్‌పర్సన్ శాంతానాగరాజు తెలిపారు. తిరుపతిలో నిర్వహించిన అంతర కళాశాలల చెస్ పోటీల్లో ప్రతిభ కనబరడంతో ఎస్వీ యూనివర్సిటీ జట్టుకు సుసిత్రను ఎంపిక చేశారని, ఈ నెల 6న విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో నిర్వహించే సౌత్‌జోన్ స్థాయి పోటీలలో పాల్గొంటుందని తెలియజేశారు. సుసిత్ర అభినందించారు.

వర్షార్పణం

- తుపాను ధాటికి దెబ్బ తిన్న పంటలు
- వరి, వేరుశనగ, టమాట పంటలకు నష్టం


పలమనేరు: ముసలిమొడుగు వద్ద..


రొంపిచెర్ల: వేరుశనగ పొలంలో నిలిచిన నీరు


పులిచెర్ల: మతుకువారిపల్లె వద్ద వర్షంతో మునిగిన వరిపంట

రొంపిచెర్ల: ఫెంగల్ తుపాను ప్రభావం మూలాన కురిసిన వర్షాలకు మండలంలో రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన వేరుశనగ, టమాట పంటలు దెబ్బ తిన్నాయి. ఎక్కువగా గానుగచింత, మోటుమల్లెల, పెద్దమల్లెల, బండకిందపల్లె గ్రామ పంచాయతీలలోని కాకులారంపల్లె, జగడంవారిపల్లె, చల్లెంపల్లె, వంకిరెడ్డిగారిపల్లె, ఎగువపాళ్యం, దుస్సావారిపల్లెలో పంట నష్టం ఎక్కువ ఉందని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. వేరుశనగ విత్తిన భూముల్లో వర్షపు నీరు నిలిచి పోవడంతో విత్తనాలు కుళ్లి పోతున్నాయని, టమాట తోటలలో కూడా నీరు నిలిచిపోవడంతో కాయలలో పురుగులు పడి చెడిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక, వరి పంట కొన్నిచోట్ల నేలకొరగడంతో మొలకలు వస్తున్నాయి. మరి కొన్నిచోట్ల వరి పంట కోత కోసి గడ్డిని పొలాలపై వేసినా తడి మూలాన కుళ్లి, పశుగ్రాసానికి కూడా ఉపయోగపడని విధంగా మారిందని చెప్పారు. ఇదలా ఉంచితే, మండలంలో వర్షాలకు కొన్ని చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి.

30 ఎకరాల్లో వేరుశనగ పంట నష్టం: ఏఓ

తుపాను ప్రభావానికి మండలంలో 30 ఎకరాల్లో వేరుశనగ పంట దెబ్బ తిందని రైతులు తన దృష్టికి తెచ్చినట్లు వ్యవసాయాధికారిణి సుధారాణి చెప్పారు. రైతు సేవా కేంద్రం సహాయకులు దెబ్బ తిన్న పంటలను పరిశీలిస్తున్నారని, వర్షం తగ్గిన తర్వాత సర్వే చేసి పంట నష్టం నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

నేలకొరిగిన వరి

పలమనేరు: మండలంలోని రబీలో సాగైన వరి ఫెంగల్ తుపాను కారణంగా వంద ఎకరాల్లో నేలకొరిగింది. ఇక్కడ సాగైన వరిలో సగం వరకూ తుపానుకు ముందే రైతులు ఒబ్బిడి చేశారు. మరో 50శాతం కోతకొచ్చిన వరి తుపాను మూలంగా వంద ఎకరాల వరకూ నేలవాలినట్టు రైతులు తెలిపారు. ఇలాగే మరో నాలుగు రోజులు వర్షాలు కురిస్తే నేలవాలిన వరి మొలకెత్తి పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో ఎక్కువమంది రైతులు పశువులకు గడ్డికోసమే వరిని సాగు చేస్తుంటారు. అయితే వర్షాలకు తడిసిన వరి పంట, లేదా ఇప్పటికే ఒబ్బిడి చేసిన పశుగ్రాసం కుళ్లిపోయి ఎందుకూ పనికి రాకుండాపోయిందని వాపోయారు. ఇదిలా ఉండగా, నేలవాలిన వరిపంటపై ఉప్పు ద్రావణాన్ని చల్లి పంటను కాపాడుకోవాలని వ్యవసాయాధికారిణి సంధ్యారాణి సూచించారు.

పులిచెర్ల మండలంలో..

పులిచెర్ల(కల్లూరు): మూడు రోజులుగా తుపాను ప్రభావం వల్లన కురుస్తున్న వర్షాలకు పులిచెర్ల మండలంలో పంటలు దెబ్బతిన్నాయి. పంట కోతకొచ్చే సమయంలో పొలాలలో నీరు నిలిచి పోవడంతో వరి పంట నీట మునిగిందని రైతులు వాపోయారు. మతుకువారిపల్లెలో రైతు విశ్వనాథ్ సాగు చేసిన వరి పంట పూర్తిగా నీటి పాలుకావడంతో పంట నీట మునిగి గింజ మొలకెత్తే పరిస్థితి కలిగింది.

క్రికెట్ బ్యాట్ల చోరీ



పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలోని ఇండోర్‌స్పోర్ట్స్ గదిలో దొంగలు పడ్డారు. రూ.లక్ష విలువైన క్రికెట్ బ్యాట్లను ఆదివారం రాత్రి చోరీ చేశారు. పలమనేరు క్రికెట్ కోచ్ బాలాజీ కథనం.. క్రికెట్ కోచింగ్‌కు వస్తున్న క్రీడాకారులు పలు టోర్నమెంట్లలో గెలుపొంది వారిచ్చిన ప్రైజ్‌మనీతో విలువైన క్రికెట్ బ్యాట్లను కొని, వాటితో ప్రాక్టీస్ చేసేవారు. వీటిపై కన్నేసిన దొంగలు తాళాన్ని పగులగొట్టి స్పోర్ట్స్ గదిలోని బ్యాట్లను చోరీ చేశారు. దీనిపై బాలాజీ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

17న పెన్షనర్ల డే

పుంగనూరు: ఈ నెల 17న పెన్షనర్ల డేను ఘనంగా నిర్వహించాలని అసోసియేషన్ అధ్యక్షుడు చెంగా రెడ్డి కోరారు. సోమవారం విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కమ్యుటేషన్ కాలపరిమితిని ప్రభుత్వం తగ్గించిందని తెలిపారు. పెన్షనర్ల దినోత్సవానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, భరత్ భూషణ్, కేశవరెడ్డి, సుబ్రమణ్యం, గంగులమ్మ, లీలావతమ్మ, ద్వారకమ్మ, నారాయణరెడ్డి, ఈశ్వర్ కుమార్‌రెడ్డి, రాఘవులజెట్టి, మహబూబ్‌సాబ్, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నియామకం


దిలీప్‌కుమార్

కుప్పం రూరల్: జాతీయ కాపు సంఘం కుప్పం అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఎస్. దిలీప్‌కుమార్‌ను నియమించినట్లు జాతీయ కాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కర్ల మురళీకృష్ణ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కాపు కులస్తుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని దిలీప్‌కుమార్ చెప్పారు.

మురుగు నీరు తొలగించాలని ధర్నా



రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు నీరు, జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న మసీదు వీధి ప్రజలు

పెద్దపంజాణి: స్థానిక పంజాణి సత్రం మసీదు వీధిలో రోడ్డుపైనే మురుగునీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ సౌకర్యం సక్రమంగా లేకపోవడం, రోడ్డుపైనే మురుగు నీరు పారుతుండడంతో నడిచి వెళ్లడానికి సైతం తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోమవారం పలమనేరు–పుంగనూరు జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ, మురుగు కాలువలు నిండి మసీదు, ఇళ్లల్లోకి వస్తున్నాయని సమస్యలపై ధ్వజమెత్తారు. రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండడంతో రాత్రిళ్లు పాములు, దోమల బెడద అధికమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకుని మురుగునీరు రోడ్డుపై పారకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీడ్ సర్వే పక్కాగా చేయరూ!


ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న సంచార జాతుల నాయకులు

పెద్దపంజాణి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసంధానంతో సంచార, పాక్షిక సంచార, డి–నోటిఫైడ్ కులాల వారి అభివృద్ధి కోసం సీడ్ సర్వేను పక్కాగా చేయాలని సంచార జాతుల కుల నాయకులు కోరుతూ సోమవారం స్థానిక ఎంపీడీఓకు బాలాజీకి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ, సంచార జాతుల కోసం కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారిక మంత్రిత్వ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సీడ్ పథకం ద్వారా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఉచితంగా శిక్షణ, కుటుంబ యజమానికి ఆరోగ్య బీమా, జీవనోపాధి యూనిట్ల ఏర్పాటుకు ఆర్థిక సాయం, ఉచితంగా ఇళ్లు మంజూరు చేస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మురళీకృష్ణ, సంచార జాతుల నాయకులు రవి, వెంకటరమణ, రెడ్డెప్ప, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఫెంగల్ తుపాన్‌తో భారీ నష్టం


సోమల మండలంలో పంటలను పరిశీలిస్తున్న ఏడి శివకుమార్, సిబ్బంది

- నేలమట్టమైన 1500 హెక్టార్ల వరి
- 300 హెక్టార్లలో టమాట
- కుళ్లిపోయిన చామంతిపూలు
- ఆదుకోవాలని రైతుల వినతి


పుంగనూరు మండలం చదళ్ల వద్ద చామంతి పూలు కుళ్లిపోతున్న దృశ్యం

పుంగనూరు: ఫెంగల్ తుపాను కారణంగా వారం రోజులుగా కురుస్తున్న వర్షాల మూలాన పంటలకు భారీ నష్టం కలిగింది. పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల , రొంపిచెర్ల మండలాల్లో వరి, టమాట, చామంతి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వరి 1500 హెక్టార్లు, టమాట 300 హెక్టార్లు, చామంతి తోటలు 30 ఎకరాల్లో దెబ్బతినడంతో పెద్దమొత్తంలో రైతులు నష్టపోయారు.

టమాతా..

ప్రస్తుతం కిలో టమాట రూ.80 నుంచి రూ.100 ధర పలుకుతోంది. రైతులు తమ కష్టాలు తీరిపోతాయకున్న సమయంలో తుపాన్ కన్నీరు మిగిల్చింది. రూ.లక్షలు ఖర్చు చేసి పండించిన పంట దెబ్బతినడంతో రైతులు విషాదంలో మునిగిపోయారు. నియోజకవర్గంలో సుమారు 300 హెక్టార్లలో టమాట పంట దెబ్బతింది. దీని కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. అలాగే చామంతి పూల ధర కిలో రూ.100 నుంచి రూ.120 వరకు ఉంది. ఇలాంటి తరుణంలో తుపానులో పూలను కోసేందుకు, విక్రయించేందుకు వీలుకాకపోవడంతో రైతులు లక్షల్లో నష్టపోయారు. అలాగే సుమారు 30 ఎకరాల్లో చామంతి పంట దెబ్బతింది.

నష్టాలపై పరిశీలన

ఏడీ శివకుమార్ ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు సోమవారం సోమల మండలంలోని తమ్మినాయునిపల్లె, కందూరు, నెల్లిమంద గ్రామాల్లో పర్యటించారు. ఏడీ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు సుమారు 500 హెక్టార్లలో వరిపంట దెబ్బతిన్నట్టు చెప్పారు. ఈ వారంలో మిగిలిన పంట అంచనాలు వేస్తామన్నారు. సుమారు 900 ఎకరాల వరకు ఉంటుందని తెలిపారు. అలాగే టమాట, చామంతి తదితర పంటల గురించి సంబంధిత అధికారులు గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత తరుణంలో రైతులు వరి కోతలు చేపట్టవద్దని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ పొలాల్లోని నీటిని బయటకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నీట మునిగిన వరిపంటపై ఉప్పుద్రావణాన్ని పిచికారీ చేస్తే వరి మొలకెత్తకుండా ఉంటుందని సూచించారు.